# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై సంయుక్త పార్లమెంటరీ సంఘం..జేపీసీ రూపొందించిన నివేదికను రాజ్యసభ ఈ రోజు ఆమోదించింది.**
2. **రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ అదుపులో ఉందని, ప్రజలను భయాందోళనకు గురిచేయవద్దని రాష్ట్ర పశు సంవర్థకశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రసార మాధ్యమాలకు విజ్ఞప్తి చేశారు.**
3. **రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే సంస్థలకు మరింత వేగంగా అనుమతులు అందించేందుకు చర్యలు చేపట్టామని ప్రభుత్వం తెలిపింది.**
4. **వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ హామీ ఇచ్చారు.**
5. **ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత కోకిల సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని ఈరోజు జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ అదుపులో ఉందని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఈరోజు ఆయన సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందని తెలిపారు. రెడ్‌జోన్‌లో ఉన్నవారు మినహా మిగిలిన వారు కోడి మాంసం, గుడ్లను ఆహారంగా తీసుకోవచ్చని స్పష్టంచేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా బర్డ్ ఫ్లూ వ్యాప్తిపై వదంతులు సృష్టించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు వివరిస్తూ...

.....వాయిస్....19 సెకన్లు....

---------------------------

రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే సంస్థలకు మరింత వేగంగా అనుమతులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న 'సింగిల్ డెస్క్ బ్యూరో'.. టాస్క్‌ఫోర్స్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొంటూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సులభతర వాణిజ్య నిబంధనలను మరింత సులువుగా మార్చాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమని వివరించింది. పెట్టుబడులతో వచ్చే వారికి మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. దీనివల్ల అవసరమైన అన్ని క్లియరెన్స్‌లు, అనుమతులను

ఒకేచోట పొందే వెసులుబాటు పారిశ్రామికవేత్తలకు లభిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది.

---------------------------

వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ రోజు ఉదయం అనంతపురం ఆకాశవాణి ప్రాంతీయ కార్యాలయం వైద్య, ఆరోగ్య శాఖపై నిర్వహించిన అనంత మిత్ర ఫోన్ ఇన్ ప్రత్యక్ష కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని శ్రోతలతో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు వారి సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ 15 మంది పౌరులతో మాట్లాడానని.. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని స్పష్టంచేశారు. జిల్లా ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేస్తూ..

,...వాయిస్...44 సెకన్లు....

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత కోకిల, స్వతంత్ర్య భారత తొలి మహిళా గవర్నర్, సరోజినీ నాయుడు జయంతి ఈ రోజు. ఆమె జయంతి సందర్భంగా ఈ రోజును జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. 1879 ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాద్‌లో జన్మించిన సరోజినీ నాయుడు స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతోపాటు, స్త్రీ విద్యకు విశేష కృషి చేశారు. రచయిత్రిగా పలు రచనలు చేసిన ఆమె 1949 మార్చి 2వ తేదీన తుది శ్వాస విడిచారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా దేశానికి ఆమె చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు.

---------------------------

ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న నిబంధనను పంచాయతీరాజ్ చట్టం నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయంపై న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబరులో జరిగిన శాసనసభ సమావేశాల్లో సవరణ బిల్లును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనికి గవర్నర్ ఆమోదం కూడా లభించడంతో తాజాగా గెజిట్ విడుదల చేశారు.

---------------------------

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, కృష్ణాజిల్లా గన్నవరం మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నారు. కొద్దిసేపటి క్రితమే పోలీసులు ఆయనను విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా.. వల్లభనేని వంశీ అరెస్ట్ నేపథ్యంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్- 30 అమలులో ఉన్నాయని పోలీస్ సూపరింటెండెంట్ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై నిరంతర సమీక్ష జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు తెలిపారు. సచివాలయంలోని వైద్య, ఆరోగ్య శాఖ

కార్యాలయం నుంచి నిన్న ఆయన రాష్ట్రంలోని 256 ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, పరిపాలనా అధికారులతో దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఆస్పత్రుల సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. మొత్తం ఆరు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరగగా.. 5 అంశాలకు సంబంధించి ప్రజల్లో సానుకూలత మెరుగైందన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం, వారి ప్రవర్తన, మందుల సరఫరా, అవినీతి విషయాలకు సంబంధించి ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని కృష్ణబాబు వెల్లడించారు. పరిశుభ్రత విషయంలో ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

--------------------------

గ్రామీణ ప్రజల అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా గ్రామాలకు సుపరిపాలన అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ నిన్న ఏర్పాటు చేసిన కార్యశాలలో ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజల అవసరాలు గుర్తించవచ్చని తెలిపారు. వికసిత్ పంచాయత్‌లో భాగంగా రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు మండలాలకు చెందిన 15 పంచాయతీలను ఎంపిక చేశామని కృష్ణతేజ వెల్లడించారు.

--------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లలోకి ప్రవేశించాలని తిరుమల తిరుపతి దేవస్థానం.. టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఇదే విషయాన్ని పలుమార్లు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులకు తెలియజేశామని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కొందరు భక్తులు వారికి కేటాయించిన సమయం కంటే ముందే వచ్చి క్యూలైన్లలోకి అనుమతించాలని టీటీడీ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారని.. సామాజిక మాధ్యమాల్లోనూ అసత్య ప్రచారం చేస్తున్నారని.. ఇది సరైన పద్ధతి కాదని టీటీడీ పేర్కొంది.

--------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 31 సెకన్లు....

======================